ఉద్యోగ ప్రయాణంలో రిటైర్మెంట్ ఓ మజిలీ

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ నళిని

ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం చేస్తున్న అడిషనల్ కమిషనర్ నళిని

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): ప్రతి మనిషికి తన ఉద్యోగ ప్రయాణంలో రిటైర్మెంట్ అనేది ఒక మజిలీ లాంటిదని, రిటైర్మెంట్ అనంతరం, తమ మిగిలిన లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికతో ప్రశాంతంగా జీవితం గడపాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ నళినీ పద్మావతి అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ కేటగిరీల్లో పనిచేసిన 13 మంది ఉద్యోగుల వయో పరిమితి పూర్తయిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగిగా తాము పనిచేస్తున్న సమయంలో అంకిత భావంతో అందించిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని నళినీ పద్మావతి చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత తమ కుటుంబ సభ్యులతో కలిసి భవిష్యత్ మొత్తం సంతోషకరంగా సాగాలని ఆమె సూచించారు. ఈ రిటైర్మెంట్ కార్యక్రమంలో వివిధ కేటగిరీలలో పనిచేసిన ఉద్యోగులకు పీఆర్వో విజయలక్ష్మి, ఏఎంసీలు జీవన్ కుమార్, శారదలతో కలిసి ఘనంగా సన్మానించారు.

హామీలు గాలికి.. హైడ్రా పేరిట హై డ్రామా!

అదను చూసి రేవంత్‌కు మాలలు బుద్ధి చెబుతారు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 30: రెడ్ల రాజ్యంలో మాల, మాదిగలు అన్ని విధాలా నష్టపోయి బలవుతున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బోరబండలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను నింపకుండా కాలయాపన చేస్తూ రేవంత్ సర్కారు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ఈ సర్కారుకు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని, ప్రధానంగా మాలలు ఈ విషయంలో ముందుంటారని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను పక్కన పెట్టి హైడ్రా పేరుతో హై డ్రామాకు తెర లేపిన సీఎం రేవంత్ తనకు అనుకూలురైన వాళ్లను అక్కున చేర్చుకుంటున్నారని శ్రీకృష్ణ విమర్శించారు. చాలా తక్కువ శాతమున్న రెడ్లకు పదవులను కట్టబెట్టడంలో దేశం మొత్తం మీద రేవంత్‌కు ఎవరూ సాటిలేరని ఎద్దేవా చేశారు. ఇక తెలంగాణలో అత్యధిక శాతమున్న బీసీలను పూర్తిగా పక్కకు పెట్టేశాడని, ఈ విషయంలో బీసీ సోదరులంతా ఏకమై వాస్తవాలను గ్రహించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇక ఎస్సీల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకొంటున్నాయని, ఇది ఎంత మాత్రం సబబు కాదన్నారు.

ఘనంగా జిల్లా యువజనోత్సవాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్, ఐఏఎస్ వాసం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

బెలూన్‌ను ఆవిష్కరించిన తెలంగాణ సీజీఎం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా సైఫాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ తెలంగాణ భవన్‌లో వేడుకల జ్ఞాపిక బెలూన్‌ను సంస్థ తెలంగాణ సర్కిల్ సీజీఎం జి.రత్న కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఇటీవల పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటేషన్స్ నిర్వహించామని, అందులో 1800 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని అధికారులు తెలిపారు. కాగా, మంగళవారం ఉదయం 11 గంటల నుంచి జరిగే వేడుకల్లో పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు.

హైడ్రా దూకుడుపై కలకలం

ప్లానింగ్ సరిగా లేనందు వల్లే వ్యతిరేకత!

కమిషనర్ తీరుపై అసహనంగా.. ఉద్యోగులు

హైడ్రా టీమ్‌లో అంతర్గత చర్చ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో కలకలం సృష్టిస్తున్న హైడ్రా కూల్చివేతల వ్యవహారంలో కమిషనర్ రంగనాథ్ దూకుడు ధోరణి పట్ల హైడ్రా టీమ్‌లోనే అంతర్గతంగా చర్చ జరుగుతోంది. హైడ్రా కూల్చివేతలపై న్యాయస్థానం ప్రశ్నలకు రంగనాథ్‌తో పాటు ఇతర అధికారులిచ్చిన సమాధానాల పట్ల హైడ్రా బృందంలో చర్చ మొదలైంది. అసలు ఎఫ్టీఎల్ పరిధి విషయంలో స్పష్టమైన వైఖరి లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఉద్యోగులు మాట్లాడుకుంటున్నారు. సామాన్యుడి ఇల్లు కూల్చివేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పాటు హడావిడిగా వ్యవహరించడం వల్లే ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకున్నామని హైడ్రా సిబ్బంది అనుకుంటున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించే పద్ధతిలో తేడాలున్నాయనే చర్చ కూడా జరిగింది. ప్రధానంగా కోర్టులో హైడ్రాకు చుక్కెదురైన నేపథ్యంలో అమీన్‌పూర్ తహసీల్దార్, కలెక్టర్, హైడ్రా కమిషనర్, ఇలా అందరు ప్రభుత్వ ఉద్యోగులే టార్గెట్ అవుతున్నారని, అసలు ఈ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి హైడ్రాను ఇంతగా ప్రోత్సహించిన సీఎం, మంత్రులు మాత్రం స్టేట్‌మెంట్స్ తప్ప ఎక్కడా చిక్కడం లేదని వారు చర్చించుకుంటున్నారు. మొదట్లో హైడ్రా టీమ్‌లో పనంటే ఉత్సాహంగా వచ్చినా ఇప్పుడు మాత్రం కొంచెం భయమవుతున్నదని ఓ కానిస్టేబుల్ మరొకరితో చెప్పుకుంటూ బాధపడుతున్నారు.



అసలు మూసీతో తమకేం సంబంధమని, మూసీ పరీవాహక ప్రాంతాల్లోని కాలనీల్లో సర్వే, మార్కింగ్ జరుగుతున్న సమయంలో స్థానికులు వ్యతిరేకిస్తుంటే.., అది తమది కాదని, హైడ్రాకు సర్వేకు సంబంధం లేదని ఒక్క ప్రకటన కూడా కమిషనర్ చేయకపోవడంపై ఆసక్తికరమైన ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. మొన్న ప్రెస్‌మీట్‌లో కూడా మూసీ వ్యవహారంపై తామే అంతా అన్నట్లుగా వ్యవహరించిన కమిషనర్.. ఇప్పటికైనా దూకుడు తగ్గిస్తారా? అంటూ మాట్లాడుకుంటున్నారు.

తమ ఉద్యోగాలు భద్రమేనా..!

అన్ని చెరువులకు ఫుల్‌ట్యాంక్ లెవల్ నిర్ధారణ అయ్యిందా? లేక ఏదో ఒక అంచనా.. ప్రకారం, ఇళ్లను తొలగిస్తున్నారా? ఇంత ఉధృతిగా పోతే తమకు నష్టం జరగదా? తమ ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనని హైడ్రా అధికారులు భయపడుతున్నారు. ఒకవైపు తహసీల్దార్లు, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ ఉద్యోగులు తమ పై అధికారులతో మాట్లాడలేక ఇవే ప్రశ్నలు వేసుకుంటున్నారట. ఎక్కడైనా వరదలకు కారణమైన ఇళ్లను తొలగించాలి. కానీ, నోటీసులు ఇచ్చి ఇళ్లను ఖాళీ చేయించాల్సింది పోయి ఇళ్లను కూలగొట్టి.., అవి కమర్షియల్ అని సమర్థించుకునే ప్రయత్నం చేయడం సరి కాదని హైడ్రా సిబ్బందే అభిప్రాయపడుతున్నారు. కొందరు తహసీల్దార్‌లైతే తామేం చేయాలో తెలియక కమిషనర్ అడిగినదానికి తమ అభిప్రాయం కాకుండా ఆయన కోరుకున్నదే చెబుతున్నారని మాట్లాడుకుంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువులు, కుంటలకు సంబంధించి రికార్డులను ఒకసారి పునః పరిశీలించుకొని నిర్ణయించుకుందామని చెప్పినా కూడా పెద్దగా రెస్పాన్స్ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాల్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతల విషయంలో పోలీసులకు మండపాల నిర్వాహకులు సహకరించాలని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాల్ సూచించారు. నార్త్ జోన్ పరిధిలోని ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓలతో పాటు దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులతో సోమవారం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. నవరాత్రి కార్యక్రమాల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధానంగా డీజే సిస్టం, ఫైర్ వర్క్స్, ఊరేగింపుల విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఫంక్షన్ హాల్స్‌లో నిర్వహించే దాండియా నిర్వాహకులు సైతం పోలీసుల సూచనల ప్రకారం, నడుచుకోవాలన్నారు. సమావేశంలో 150కి పైగా మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లోనూ రబీ స్థాయిలో విద్యుత్ డిమాండ్

సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో విద్యుత్ నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా ఆపరేషన్స్ విభాగం అధికారులు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. డిస్కం పరిధిలోని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లతో, చీఫ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. రాష్ట్రంలో ఈసారి రికార్డు స్థాయిలో వరి సాగు జరుగుతున్నదని, గత రబీ సీజన్‌లో నమోదైన స్థాయిలో ఈ ఖరీఫ్ సీజన్ విద్యుత్ డిమాండు రికార్డు స్థాయిలో నమోదవుతుందన్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో గరిష్ట డిమాండు 9862 మెగావాట్లు ఉండగా, ఈసారి 9910 మెగావాట్లకు చేరింది. ఈ సీజన్ ముగిసే నాటికి 10వేల మెగావాట్లు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాపైనే ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఫీడర్లపై, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఎలాంటి ఓవర్ లోడ్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు లోడ్‌లను చెక్ చేసుకుంటూ రైతాంగానికి ఎలాంటి సరఫరా సమస్యలు లేకుండా చూడాలని సీఎండీ ఆదేశించారు.

రైతు హామీల సాధన దీక్ష..

అన్నదాతలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా బీజేపీ ప్రజా ప్రతినిధులు 24 గంటల సాధన దీక్షను సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించారు. దీక్షలో ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, సూర్య నారాయణ, హరీశ్ బాబు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి కూర్చున్నారు.

– చిక్కడపల్లి, సెప్టెంబర్ 30;

13న అలయ్..బలయ్

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కార్యక్రమం

హైదరాబాద్, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): దసరా సందర్భంగా బీజేపీ అగ్రనేత, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో కొన్నేండ్లుగా నిర్వహిస్తున్న 'అలయ్ బలయ్'ను ఈ యేడు అక్టోబర్ 13న ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, విశిష్ట అతిథులుగా తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, ఉత్తరాఖండ్, మేఘాలయ గవర్నర్లు గుర్మిత్ సింగ్, విజయశంకర్ హాజరుకానున్నారని వెల్లడించారు.

బకాయి చెల్లించకపోతే.. తెలంగాణ బంద్ తప్పదు

- 16 లక్షల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హెచ్చరిక
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య.

విద్యార్థుల మహాధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

చిక్కడపల్లి, సెప్టెంబర్ 30: డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులు చదువుతున్న 16 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్, తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కాలేజీ కోర్సులు చదువుతున్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు 4,500 కోట్లు చెల్లించాలని, స్కాలర్ షిప్‌లు పెంచాలని సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, డిగ్రీ, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు పూర్తి చేసినా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఒక వైపు విద్యార్థులు ఇంకో వైపు కాలేజీ యాజమన్యాలు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఫీజుల బకాయిల కారణంగా సర్టిపికెట్లు రాక అటు ఉన్నత చదువులు చదవలేక ఇటు ఉద్యోగాలు పొందలేని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వ వ్యతిరేక వైఖరి విడనాడి వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో బసీ సంఘం నాయకులు గోరేగే మల్లేశ్, గుజ్జ సత్యం, నీల వెంకటేశ్, అంజి, అనంతయ్య, రాజేందర్, రాంకోటి, నందా గోపాల్, రామ్ మూర్తి, సతీశ్, పవన్, ప్రీతం, హరీశ్, రవి, రమ్ దేవ్ మోదీ, ప్రభాకర్, కోటేశ్వరి పాల్గొన్నారు.

సారూ.. ఇండ్లు కేటాయించండి!

ప్రజావాణికి ఇండ్ల దరఖాస్తులే అధికం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వారు తాము ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని, తమకు ఇండ్లు కేటాయించాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. కాగా, 181 దరఖాస్తుల్లో 125 గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన దరఖాస్తులే కావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ దశరథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక కమలానగర్ మూసీ పరీవాహక నివాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

బాధితులకు అండగా ఉంటాం..

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నేడు అంబర్‌పేటలో కేటీఆర్ పర్యటన..

గోల్నాక, సెప్టెంబర్ 30: అంబర్‌పేటలోని మూసీ నివాసితులు భయాందోళనకు గురికావొద్దని, బీఆర్ఎస్ పార్టీ రక్షణ కవచంలా అండగా ఉంటుందని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హామీ ఇచ్చారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ దుర్గానగర్, గోల్నాక డివిజన్ కమలానగర్ తదితర మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి అక్కడి నివాసితులతో మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతాల నివాసితులు తమ ఇండ్లను హైడ్రా అధికారులు కూల్చుతారని భయాందోళనకు గురికావొద్దని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంబర్‌పేట మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. మూసీ నివాసితులందరూ హాజరు కావాలని కోరారు.

3 నుంచి శిల్పకళా వేదికలో జీ స్పార్క్-24 సదస్సు

జీ స్పార్క్ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సదస్సు చైర్మన్ డాక్టర్ రంగారెడ్డి, వైస్ చైర్మన్ఆర్. గోవింద్‌హరి.

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 30: అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తున్న యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (AMR)పై ప్రజలలో అవగాహన పెంచవలసిన అవసరం ఉందని జీ స్పార్క్ చైర్మన్ డాక్టర్ రంగారెడ్డి అన్నారు. అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నగరంలోని మాదాపూర్ హైటెక్ సిటీలో గల శిల్పకళా వేదికలో ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు జరగనున్న జీ-స్పార్క్ 2024 సదస్సు పోస్టర్‌ను రెడ్‌హిల్స్‌లోని ప్యాప్సీలో సదస్సు చైర్మన్ డాక్టర్ రంగారెడ్డి, కో చైర్మన్ ఆర్.గోవింద్ హరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగారెడ్డి మాట్లాడుతూ, దక్షిణ భారత దేశంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. సదస్సు ముఖ్య ఉద్దేశం ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్(ఐపీసీ), యాంటీ మెక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్), గ్లోబల్ సౌత్(ఆసియా, ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, సౌత్‌లోని వనరుల-పరిమిత దేశాలు) నుంచి రోగులను రక్షించడమే వేదిక లక్ష్యమన్నారు. కొవిడ్ వంటి మహమ్మారి సంసిద్ధతపై మెరుగైన విధానాలు, పరిశోధన, అనుకూల పరిష్కారాలు, అభ్యాసాల కోసం కృషి చేయడం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఏఎంఆర్ అనేది కంటికి కనిపించని మహమ్మారి అని పేర్కొన్నారు. దీని కారణంగా ప్రపంచంలో ఐదు మిలియన్ల మంది మృత్యువాత పడినట్లు తెలిపారు. యాంటీ బయోటిక్స్ అధికంగా వాడటం వల్ల జరిగే అనర్థాలపై పలువురు వైద్యులు ప్రసంగించి ప్రజలను అప్రమత్తం చేస్తారన్నారు. జీ స్పార్క్-2024 సదస్సు ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా(ఐఎప్‌సీఏఐ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యుఓహెచ్), ప్రగ్యాన్ సస్టైనబుల్ హెల్త్ అవుట్ కమ్స్ ఫౌండేషన్ (పీఆర్ఏఎస్‌హెచ్ఓ)ల సహకారంతో జరుగుతుందని ఆరోగ్య సంరక్షణ సంస్థలు, పరిశ్రమలు, ప్రొఫెషనల్ పార్టనర్ల సమన్వయంతో జరుగుతుందని వారు వెల్లడించారు.

బ్యాడ్మింటన్ చాంపియన్ ఏపీఎస్ బొల్లారం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సుచిత్రా బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో ఆర్మీ పబ్లిక్ స్కూల్ బొల్లారం చాంపియన్‌గా నిలిచింది. సోమవారంతో ముగిసిన టోర్నీలో అండర్-19 విభాగంలో ఆర్మీ స్కూల్ అగ్రస్థానం దక్కించుకోగా, భవన్స్ శ్రీరామ కృష్ణ, ఇండస్ యూనివర్సల్ స్కూల్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మిగతా విభాగాల్లో విద్యాంజలి హైస్కూల్ (అండర్-17), భవన్స్ శ్రీరామకృష్ణ (అండర్-14) టైటిళ్లు దక్కించుకున్నాయి. ఈ టోర్నీలో ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లు అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీపడ్డారు.

సిటీ స్మాల్ కాజెస్ కోర్టులో స్వచ్ఛ భారత్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): స్వచ్ఛతా హి సేవ క్యాంపెయిన్‌లో భాగంగా మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సిటీ స్మాల్ కాజెస్ కోర్టులో సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుక యార పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన అడ్వకేట్లకు, కోర్టు సిబ్బందికి ఆమె స్వచ్ఛ భారత్ గురించి అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావాణి కార్యక్రమమని, సమస్యలను పరిష్కరించడంపై ఆయా విభాగాల అధికారులు దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నగరం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, కమిషనర్ విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ ద్వారా ఐదు విన్నపాలు రాగా, సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం పంపించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 42 అర్జీలు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 అర్జీలు వచ్చాయి. కూకట్‌పల్లిలో 55, శేరిలింగంపల్లి జోన్‌లో 20, సికింద్రాబాద్‌లో 17, ఎల్బీనగర్ జోన్‌లో 13, ఖైరతాబాద్ జోన్లో 7, చార్మినార్ జోన్‌లో 1 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి, ట్విట్టర్, ఆన్‌లైన్ జీహెచ్ఎంసీ యాప్‌లో వచ్చిన సమస్యలను కూడా పరిష్కరించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళినీ పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, అడిషనల్ సీసీపీలు ప్రదీప్ కుమార్, గంగాధర్, జాయింట్ కమిషనర్ మహేశ్ కులకర్ణి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 30(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవ - 2024 క్యాంపెయిన్‌లో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సఫాయి మిత్ర సురక్షా శివిర్ అనే థీమ్‌తో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టింది. ఇందులో భాగంగా సంపూర్ణ స్వచ్ఛతకు పాల్పడుతున్న బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ టీమ్‌ను బ్యాంక్ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ దేబదత్త చంద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ లాల్ సింగ్, బీన వహీద్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ సురేంద్ర కుమార్ దీక్షిత్‌లతో పాటు బ్యాంక్ 22 జోనల్ కార్యాలయాల నుంచి సిబ్బంది పాల్గొన్నారు.